# 13. పెంపకం

ఒక చిన్న జలపాతం దగ్గరి కొండకింది భాగాన్ని ఆనుకొని రెండు పూరిళ్ళు ఉండేవి. అవి ఇద్దరు కర్షకుల నివాసాలు. వారిద్దరూ కటిక నేలకు చెమటోడ్చి దున్నుతూ తమ కుటుంబాల్ని పోషించుకునేవాళ్ళు. పదిహేను నెల్లనుంచీ, ఆరేళ్ళ వయస్సుగల నలుగురేసి పిల్లలు ఒక్కొక ఇంట్లో ఉండేవాళ్లు. ఉదయంనుంచీ సాయింత్రందాకా ఆ పిల్లలు ఇళ్ళముందు ఆడుకునేవాళ్ళు. ఆ కర్షకులు దాదాపు ఒకే సమయాన సంతానాల్ని పొందారు.

పిల్లలందరూ కలిసి ఆడుకునే సమయాల్లో తల్లులకు తమ పిల్లల్ని గుర్తించటం కొంచెం కష్టంగా వుండేది. తండ్రులకు అంతా అయోమయంగా ఉండేది. తమకు కావాల్సిన కుర్రాడికోసం వారు రెండుమూడు పేర్లన్నా పిలవాల్సి వొచ్చేది.

మొదటి ఇంట్లో టువాచీ కుటుంబంవాళ్ళు నివసించేవాళ్ళు. వారికి ముగ్గురు మగపిల్లలూ, ఒక ఆడపిల్లాను. రెండోఇంట్లో వాలిన్ కుటుంబం నివసించేది. వారికి ముగ్గురు కూతుళ్ళూ, ఒక కొడుకూను. రెండు కుటుంబాలూ – బంగాళాదుంపలూ పులుసూ, మంచిగాలీ వీటిమీద నిరాడంబరంగా జీవించేవాళ్ళు. ఉదయం ఏడింటికీ మిట్టమధ్యాహ్నం పన్నెండింటికీ సాయింత్రం ఆరింటికీ – తల్లులు ఆహారం పెట్టేందుకు తమ పిల్లల్ని పోగుచేసేవాళ్ళు. పిల్లలు – అర్ధశతాబ్దపు వాడుకతో మెరుగుపెట్టబడ్డ టేబిల్ చుట్టూ – తమ యీడును అనుసరించి వరసాగ్గా కూర్చునేవాళ్ళు. అందరికన్నా చిన్నబిడ్డ నోరు టేబిల్ మట్టానికి అందేదికాదు. రొట్టె, ఉడికించిన బంగాళాదుంపలూ, రెండుమూడు ఉల్లిపాయలూ, కాస్త కాబేజీ – వీటితో వాళ్ళు కడుపులు నింపుకునే

వాళ్ళు. చిన్న బిడ్డకు తల్లే అన్నం పెట్టేది. ఆదివారంనాడు మాత్రం ఉడికించిన మాంసం ఉండేది. తండ్రి తన భోజనాన్ని అటూఇటూ చూసి అనేవాడు: "ప్రతిరోజూ ఇదిచేస్తే బాగుండును."

ఆగస్టు నెలలో ఒకనాటి మధ్యాహ్నం ఒక గుర్రబ్బండి ఆ రెండిళ్ళ ముందు ఆగింది. బండిలోని స్త్రీ, పురుషుడితో అంది : "హెన్రీ! చూడు ఆ పిల్లల గుంపును! వాళ్ళు ఆ దుమ్ములో ఆడుకుంటూ ఎంత బాగున్నారో!"

హెన్రీ జవాబేమీ ఇవ్వలేదు. ఆమె బాధపడుతూ ఇలా మాట్లాడటానికి అతడు బాగా అలవాటుపడ్డాడు.

ఆమె అంది : "వాళ్ళను తప్పకుండా ముద్దుపెట్టుకోవాలి. వాళ్ళల్లో ఒకణ్ని ఆ చిన్నవాణ్ని నా స్వంతం చేసుకుంటే –"

బండిలోంచి దూకి పిల్లల దగ్గరకు పరుగెత్తింది. టువాచీ కుటుంబంలోని చిన్నపిల్లవాణ్ని తన రెండు చేతులతోనూ పట్టుకొని – దుమ్ము కొట్టుకున్న వాడి రెండు చెక్కిళ్ళమీదా, బురదతో అంటుకుపోయిన వాడి ఉంగరాలజుట్టు మీదా ముద్దులవర్షం కురిపించసాగింది. ఈ బాధను వొదిలించుకునేందుకు కుర్రాడు తన రెండుచేతుల్ని అటూఇటూ ఊపసాగాడు...తరువాత ఆమె బండి ఎక్కి త్వరత్వరగా వెళ్ళిపోయింది.

మరుసటివారం ఆమె మళ్ళీ వొచ్చింది. నేలమీద పిల్లలకు మధ్యగా కూర్చొని – చిన్నబిడ్డకు మంచిరకం రొట్టెల్ని పెట్టింది. మిగతావాళ్ళకు అనేక తినుబండారాల్ని పంచి – తనూ ఒక చిన్న బజారు పిల్లయినట్టు వాళ్ళందరితోనూ కలిసి ఆడుకోసాగింది. ఆమె భర్త మాత్రం బండిలోనుంచే శాంతంతో యీ దృశ్యాన్ని చూస్తూ కూర్చున్నాడు.

ఆమె తన జేబుల్ని రాగిడబ్బులతోనూ అనేక తినుబండారాలతోనూ నింపుకొని రాసాగింది. మెల్లిగా పిల్లల తల్లిదండ్రులతో స్నేహాన్ని సంపాయించింది. ఆమె పేరు మెటిల్డా.

ఒకనాటి ఉదయం ఆమె భర్త బండిదిగి ఆమెను అనుసరించాడు. ఇప్పటికి బాగా పరిచయం ఏర్పడ్డ పిల్లలచుట్టూ తిరక్కుండానే టువాచీల ఇంట్లోకి ఆమె ప్రవేశించింది. టువాచీలు ఇంట్లోనే కట్టెల్ని కొట్టుకుంటున్నారు. ఈ అతిథుల్ని చూసి వారు ఆశ్చర్యపడి, చప్పునలేచి నిలబడి – వారికి రెండుకుర్చీల్ని చూపి వారి మాటలకు ఎదురు చూడసాగారు.

మెటిల్డా అనుమానిస్తూ, పొగడ్తల్ని సూచించే కంఠంతో అంది : "మీరు చాలా మంచివాళ్ళు. ఇవ్వాళ నేడు మిమ్మల్ని చూసేందుకు వొచ్చాను...ఎందుకంటే – మీ పిల్లల్లో ఒకణ్ని తీసుకుపోవటమంటే నాకు ఇష్టం...నాకు చాలా ఇష్టం!"

ఆ దంపతులు ఆశ్చర్యంతో జవాబు చెప్పలేకపొయ్యారు.

మెటిల్డా గాలిపీల్చి మళ్ళీ అంది : "మాకు పిల్లలు లేరు..నేనూ, నాభర్తా ఇద్దరమూ ఒంటరిగానే ఉన్నాం!....ఒక పిల్లాణ్ని మాతో ఉంచుకుంటాం...మీకు ఇష్టమేనా?"

కర్షకుని భార్యకు అర్థ మవసాగింది. "మా ఛార్లెట్‌ను తీసుకు వెళ్లా లను కుంటున్నారా? వీల్లేదు...ఏమీ వీల్లేదు–" అంది.

హెన్రీ అన్నాడు : "నాభార్య మీకు విషయాన్ని బాగా విప్పి చెప్పలేకపోయింది. మేము మీ బిడ్డను పెంచుకోదల్చాం. కాని కుర్రాడు మాత్రం మిమ్మల్ని చూసిపోతూనే ఉంటాడు. వాడు తప్పకుండా సన్మార్గుడయేందుకు చాలా అవకాశాలున్నయ్. అలా అయేట్టయితే వాడు మాకు వారసుడే అవుతాడు. మాకు సంతానం కలిగినట్టయితే – మా బిడ్డల్తో పాటే వాడిక్కూడా సమాన భాగం వుంటుంది. ఒకవేళ వాడు చెడిపోయినట్టయితే – వాడిపేర ఇరవైవేల ఫ్రాంకుల్ని బ్యాంకులోవేసి వాడు పెద్దవాడుకాగానే ఆ డబ్బు తీసుకునే ఏర్పాటు చేస్తాం...మేము మిమ్ముగూర్చి కూడా ఆలోచించాం : మీ మిగతా జీవితమంతా నెలకు వంద ఫ్రాంకుల చొప్పున మీకు ఇస్తాం...ఇప్పుడు మీకిది అర్థమైందా?"

ఇల్లాలుకు కోపంవొచ్చింది: 'మా' ఛార్లెట్‌ను అమ్మమని మీరు అడుగుతున్నారు. తల్లిని అడగాల్సిన మంచి ప్రశ్న!...వీల్లేదు...అది భరిస్తారా? ఘోరమైన విషయం!"

కర్షకుడు ఏదో గాఢంగా ఆలోచిస్తూ మాట్లాడలేదు కాని భార్య చెప్పేదాన్ని తనుకూడా బలపరుస్తూన్నట్టు, ఆమె చెప్పిన దానికి తలతిప్పాడు.

మెటిల్డా నిరాశతో ఏడ్వసాగింది. పిల్లవాడు తనకు కావాల్సింది దొరకనప్పుడు ఉపయోగించే కంఠధ్వనితో – ఏడుపుతో తెగేమాటలతో అంది : "వాళ్ళు ఒప్పుకోరు...హెన్రీ! వాళ్ళు ఒప్పుకోరు."

హెన్రీ చివరిసారి ప్రయత్నించాడు : "కాని మీ కుర్రవాడి భావి జీవితం ఆలోచించండి...వాడి సౌఖ్యం...వాడి భాగ్యం...వాడి..."

ఇల్లాలి కోపం అతన్ని మాట్లాడనివ్వలేదు.

"మాకు బాగా అర్థమైంది. మేము అంతా ఆలోచించాం. మీరు వెళ్ళండి...మళ్ళీ యిక్కడికి రావొద్దు...పిల్లాణ్ని యీవిధంగా ఎత్తుకుపొయ్యే ఉద్దేశం...అబ్బ!" అని ఆమె వెళ్ళిపోబోయింది. మెటిల్డాకు చప్పున – ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారన్నమాట జ్ఞాపకం వొచ్చింది. ఒక్క క్షణంకూడా ఆలోచించకుండా కన్నీళ్ళతో మెటిల్డా అడిగింది: "ఆ రెండో కుర్రాడు మీవాడు కాదనుకుంటాను–"

"కాదు..వాడు అవతలి ఇంటి వాడు. మీకు ఇష్టముంటే – అక్కడకూడా ప్రయత్నించండి" కర్షకుడు జవాబుచెప్పి భార్య కోపంతో ఇంకా మారుమోగే ఇంట్లోకి వెళ్ళిపొయ్యారు.

వాలిన్ కుటుంబదంపతులు ఒకేప్లేటులోని వెన్న రాసిన రొట్టెల్ని మెల్లి మెల్లిగా తింటున్నారు. హెన్రీ యీసారి విషయాన్ని మెల్లిగా ఉద్రేకం లేకుండా చెప్పాడు. మొదట ఆ దంపతులు నిరాకరణ సూచికంగా తలతిప్పారు; కాని తమక్కూడా నెలకొక వంద ఫ్రాంకులు వొస్తయ్యని విన్నప్పుడు, వారి నిర్ధారణ పట్టుతప్పి - ఒకర్నొకరు ప్రశ్నార్థకంగా చూసుకున్నారు.

చాలా సేపటివరకూ వారు నిర్ధారణకు రాలేక, నిశ్శబ్దంగా ఊరుకున్నారు. చివరకు ఇల్లాలు భర్తను అడిగింది. "మీరు దీనికి ఏమంటారూ?"

అతను అన్నాడు : "ఇది వొదిలెయ్యాల్సిన విషయం కాదనుకుంటాను-"

ఏమౌతుందోనన్న ఆతృతతో చూస్తూన్న హెన్రీ - కుర్రవాడి భావిజీవితాన్ని గూర్చి, వాడి సౌఖ్యాన్నిగూర్చి, తరువాత వాడు తన తల్లిదండ్రులకు చేసే సహాయాన్ని గూర్చి మాట్లాడాడు.

కర్షకుడు అడిగాడు : "మాకు నెలసరిగా ఇచ్చే వంద ఫ్రాంకుల సంగతీ ప్లీడర్ ఎదుట రాసి ఇస్తారా?"

"తప్పకుండా...రేపే!" అన్నాడు హెన్రీ.

ఈ విషయం మీద ఇంకా ఆలోచిస్తూన్న ఇల్లాలు అంది : "కుర్రాణ్ణి తీసుకువెళ్ళినదానికి నెలకు వంద ఫ్రాంకుల ప్రతిఫలం చాలదు. కొద్ది సంవత్సరాలలోనే వాడు పని చెయ్యగలుగుతాడు...అందుకని మాకు నూటఇరవయ్యన్నా ఉండాలి-"

ఓర్పును పూర్తిగా కోల్పోయిన మెటిల్డా దీనికి వెంటనే అంగీకరించింది. అప్పటికప్పుడే కుర్రాణ్ణి తనతో తీసుకు వెళ్ళదల్చటం వల్ల - ఆ దంపతులకు వందఫ్రాంకుల్ని బహూకరించింది. హెన్రీ యీ వ్యవహారాన్నంతట్నీ రాతలో ఇచ్చాడు. ఆ ఎగ్రిమెంటుమీద ఆ ఊరిపెద్దా, పొరుగు కర్షకుడూ సాక్షి సంతకాలు చేశారు.

తను హృదయపూర్వకంగా కోరే వస్తువును షాపులోంచి పట్టుకుపొయ్యే మాదిరిగా - ఏడుస్తూన్న కుర్రాణ్ణి విజయసూచికంగా నవ్వుతూ మెటిల్డా తన వెంట తీసుకు పోయింది. టువాచీ కుటుంబీకులు తమ ద్వారంలో నిలబడి - ఏవగించుకుంటూనే - కుర్రాడు అదృశ్యమవటాన్ని నిశ్శబ్దంతో గమనించారు; కాని తాము నిరాకరించామన్న విచారం వారికి లేకపోలేదు.

## 2

జీన్ వాలిన్ గూర్చి మరేమీ తెలియరాలేదు. వాలిన్ కుటుంబీకులు మాత్రం ప్లీడరుగారి దగ్గర్నుంచి తమ నూట ఇరవై ఫ్రాంకులూ తెచ్చుకునేందుకు ప్రతినెలా వెళ్తూండేవారు.

పొరుగింటివారితో వారికి ప్రాణాంతకమైంది. పొరుగింటి ఇల్లాలు ప్రతి ఇంటికీపోయి పిల్లల్ని అమ్ముకోవటం ఎంత ఘోరమో, అమానుషమో వర్ణించేది. అప్పుడప్పుడు ఛార్లెట్‌ను తన చేతులలోకి తీసుకొని - వాడికి అర్థమౌతూన్నట్టే భావిస్తూ అనేది : "నేను నిన్ను అమ్మలేదు నాయనా! ...నేను అమ్మను..నేను సంతానాన్ని అమ్ముకోను... నేను భాగ్యవంతురాల్ని కాదు. కాకపోయినా పిల్లల మీద వర్తకం చెయ్యను."

ప్రతి రోజూ, ప్రతి సంవత్సరమూ ఆమె యింటిగుమ్మం మీద నిలబడి ఇలాటి నిందాపూరితవాక్యాల్ని అనేది. ఆ కంఠధ్వని పక్క పూరింటిలోని హృదయాల్ని దూసుకుపొయ్యేది. టువాచీ ఇల్లాలు - తను ఛార్లెట్‌ను అమ్మకపోవటంవల్ల - ఆ గ్రామంలో తనకు మించిన ఉత్తమ ఇల్లాలు లేదనుకునేది.

ప్రజలు ఆమెతో అనేవాళ్ళు : "అది చాలా ఆశ గొల్పే విషయం...కాని టువాచీ ఇల్లాలు - ఒక మంచి తల్లి అవలంబించాల్సిన విధానాన్నే నిరూపించింది..." ఈ విధంగా ఆమె ఆదర్శురాలైంది.

పద్దెనిమిదేళ్లూ యీ అభిప్రాయాన్ని ఛార్లెట్‌లో ఆమె జాగ్రత్తగా పెంచగలిగింది. తను అమ్ముడవకపోవటంవల్ల - తన స్నేహితులందరికన్నా తనే గొప్పవాడని అతను అనుకునేవాడు.

నెలసరిగా తమకు వొచ్చే పైకంవల్ల వాలిన్ కుటుంబీకులు సౌఖ్యంగా కాలం గడపసాగారు. టువాచీలను మాత్రం మామూలు బీదరికం ఇంకా వొదల్లేదు. పొరుగువారి అభివృద్ధి టువాచీలకు చాలా బాధాకరమైంది. టువాచీల పెద్ద కుర్రాడు మిలటరీలో జేరాడు. రెండోవాడు చనిపొయ్యాడు. తన ముసలితల్లిదండ్రులకూ, ఇద్దరు చెల్లెళ్ళకూ ఆధారంగా ఛార్లెట్ ఒక్కడే మిగిలాడు. ఛార్లెట్‌కు ఇరవై ఒక్కటో ఏడు వొచ్చింది-

ఒకనాటి ఉదయం మంచిరకం గుర్రపుబండీ వొకటి ఆ ఇళ్ళముందు ఆగింది. బంగారపు గొలుసువేసిన జేబు గడియారాన్ని చూస్తూ బండిదిగి వొక ముసలామెతో పరిచయం చేసుకుంటున్నాడు ఒక యువకుడు.

"ఔను...ఆ రెండో ఇల్లు" అంది, ముసలామె.

అది తన ఇల్లే ఐనట్టు - ఆ యువకుడు - వాలిన్ కుటుంబీకుల ఇంట్లో ప్రవేశించాడు. ఆ ముసలి ఇల్లాలు బట్టలు ఉతుక్కుంటోంది. బలహీనుడై పోయిన తండ్రి చలిమంటదగ్గర కునికిపాట్లు పడుతున్నాడు. ఇద్దరూ అతనివైపు చూశారు.

యువకుడు ఇద్దరికీ నమస్కరించాడు.

వారు ఆశ్చర్యపోతూ లేచి నిలబడ్డారు. ఆ తొందరలో ముసలామె సబ్బును బిందెలోనే జారవిడిచింది.

"మా అబ్బాయా? మా అబ్బాయేనా?" అంది.

అతను ఆమె రెండు చేతుల్లోకిపోయి ముద్దుపెట్టుకొని, "అవునమ్మా" అన్నాడు.

ఉద్రేకంతో ఊగిపోతున్నా - తన మామూలు గొంతుతోనే ముసలితండ్రి "ఐతే జీన్! మళ్ళీ వొచ్చావన్నమాట?" అన్నాడు, వొక నెల క్రితమే వాణ్ని తను చూసినట్టు.

ఆశ్చర్యంలోంచి బైట పడ్డాక - అతన్ని ఆ గ్రామస్తులందరికీ చూపించి తీరాలని ఆ దంపతులు పట్టుపట్టారు. గ్రామపెద్దలూ, స్కూలుమాష్టరూ మొదలైన వాళ్ళందరి వద్దకీ అతన్ని తీసుకువెళ్ళారు.

ఛార్లెట్ గుమ్మంలో నిలబడి జీన్ అటు వెళ్ళటాన్ని చూశాడు. ఆ సాయింత్రం భోజనాల దగ్గర తల్లిదండ్రులతో అన్నాడు: "వాలిన్ కుటుంబీకుణ్ణి వాళ్ళు తీసుకుపోతూంటే - మీరు ఊరుకోవటం - ఎంత మౌఢ్యం!"

తల్లి అంది, "మేము బిడ్డల్ని అమ్ముకోము."

తండ్రి యేమీ మాట్లాడలేదు.

ఛార్లెట్ అన్నాడు: "ఆ విధంగా త్యాగం చెయ్యటం - గొప్ప అదృష్టం!" తండ్రి కోపంతో, "ఐతే నిన్ను మేము ఉంచుకున్నందుకు నిందిస్తున్నావన్నమాట?" అన్నాడు.

"ఔను...మీరింత మూఢులుగా ఉన్నందుకు మిమ్మ నిందించాల్సిందే! తమ బిడ్డల సదవకాశాల్ని భంగపరిచేది మీలాటి తల్లిదండ్రులే! నేను మిమ్ము వొదిలిపెడితే - నా విధి తీరుతుంది."

తల్లి కార్చే కన్నీరు ఆమె భోజనం చేసే కంచంలో పడ్డది. కలుపుకున్న పులుసు అన్నాన్ని చూడక సగం కిందపోసుకుంటూ దుఃఖం పొంగివచ్చే గొంతుతో ఆమె అంది : "జీవితాంతంవరకూ బిడ్డను జాగ్రత్తగా పెంచుకుంటూ వొచ్చినందుకు ఇదా ప్రతిఫలం!"

"నేనసలు పుట్టకుండా ఉంటే బాగుండేది. ఇంతకుముందు వాణ్ని చూస్తే నా రక్తం ఉప్పొంగింది. అప్పుడు నేను అనుకున్నాను : నా హక్కులే నాకు ఉన్నట్టయితే - వాడి స్థానాన నేను ఉండాల్సింది అని-" కఠినంగా యీ మాటలు అన్నాక, ఛార్లెట్ కుర్చీలోంచి లేచి నిలబడి మళ్ళీ అన్నాడు: "నాకు యీ కొంపలోంచి బైటపడటమే మేలుగా తోస్తోంది. ఉదయంనుంచీ సాయింత్రంవరకూ మీసేవే చెయ్యాల్సి వొస్తోంది. మీ జీవితాల్ని మరింత భారం చెయ్యాలని నాకు కోరికగా వుంది. నేను మిమ్ముల్ని ఎన్నటికీ క్షమించలేని విషయమిది...ఎన్నటికీ కూడా!"

ముసలిదంపతులు ఆశ్చర్యంతోనూ, దుఃఖంతోనూ మాట్లాడలేక అలాగే చూస్తున్నారు.

ఛార్లెట్ మళ్ళీ అన్నాడు : "అసలు ఆ ఆలోచననే నేను భరించలేకుండా వున్నాను. పోయి ఇంకా ఎక్కడన్నా జీవితాన్ని గడపటం మంచిది."

అతను తలుపు తెరిచాడు. అనేక గొంతులు కలిసిన ధ్వని వినవొచ్చింది. చాలారోజుల తరువాత మళ్ళీ తిరిగి వొచ్చిన తమ కొడుకుకోసం వాలిన్ కుటుంబీకులు గొప్ప విందు చేస్తున్నారు.

ఛార్లెట్ కోపంతో నేలనుతన్ని వెనక్కు తిరిగి తల్లిదండ్రుల్తో, "ఎందుకూ పనికిరాని ముసలిపీనుగులు!" అని ఆ చీకటిలో మాయమయ్యాడు.